II
నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023

మీకు తెలుసా?

**'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా' మన తెలంగాణ**


రాష్ట్రంలో విత్తనోత్పత్తి ఇలా...

| 2014–15లో | 2022–23లో |
|---|---|
| 3,18,600 క్వింటాళ్లు | 5,25,000 క్వింటాళ్లు |





### యార్కర్



## ఏంజేయని సన్నాసులు మనకెందుకురా?

ఏంది తాత గా బీజేపీ, కాంగ్రెసోళ్ల
ప్రచారానికత్తే గట్ల కట్టెవట్టి
తరుముతున్నవ్..
ఈ సారి ఓటెత్తె నీకు పింఛన్
పెంచుతురట..
పెట్టుబడి సాయం ఎక్కువిత్తరట
అనంగనే తాత మనుమని మీదికి కట్టె
మర్రేసిండు

గీ బీజేపీ, కాంగ్రెసోళ్ల గురించి
నువ్వు నాకు చెప్పేటంత
మొగోనివైనావ్రా..
కాంగ్రెసోని కాలంల ఒక్కనాడన్న
నేను ఇంటిపట్టున ఉండలే..
కరెంట్ లేదు.. నీళ్లు లెవ్వు..
పంట పండిందీ లేదు..
పొట్ట చేతపట్టుకొని
మీ నాయినవ్వను, నాయినను,
అత్తను ఇడిశిపెట్టి
ఏడ్సుకుంట బొంబాయికి పొయ్యి
హమాలీ పన్జేసిన
ఇగ గీ బీజేపోడు దేశంల
అచ్చిననాటినుంచి
ఉప్పు, పప్పు, నూనె, పిట్రోలు, గ్యాస్
రేట్లు చూసినవా
మనం ఎంతజేసినా జేబుకు
తూటువడ్డట్టే జేసిన్రు మన బతుకు
ఏదో కేసీఆర్ సార్ పింఛిన్లు,
పెట్టుబడిసాయం..
మూడు పంటలకు నీళ్లు ఇయ్యవట్టి
గిప్పుడు గీ తీరుగ ఉన్నం.

గిప్పుడు ఎలచ్చన్లు రాంగనే
పెట్టిపొయ్యనమ్మ పెయ్యంత
పునికిజూసిందన్నట్టు
కొమురయ్య మంచిగున్నవా?.. అని అత్తే
కట్టెమర్రెయక మర్యాదలుజెయ్యాల్నా..!
గన్ని తిప్పలు వెట్టిన
సన్నాసులు మనకెందుకురా?

అవ్ తాతా మంచిపని జేసినవ్..
నాకు మొన్న మొన్ననే ఓటచ్చింది..
గివన్నీ నాకు తెల్వయే..
కేసీఆర్ కంటే మంచిగజేస్తమని
గా ఫేస్‌బుక్కులు, వాట్సాప్‌లల్ల
గీ నరుకుడుగాళ్లను నరికితే నమ్మిన..
నీ పాత ముచ్చట్లు చెప్పి నా కండ్లు
తెరిపిచ్చినవ్ తాతా

-రాజు అతికం



## హూ ఆర్ యూ..! హౌ ఆర్ యూ..!!

**బీ**జేపీలో హూ ఆర్ యూ... హౌ ఆర్ యూ.. కల్చర్ పెరిగిపోయిందట. సిద్ధాంత పరమైన పార్టీ.. క్రమశిక్షణకు మారుపేరు.. అని నమ్మి మహబూబ్‌నగర్‌కు చెందిన మాజీ మంత్రి పీ చంద్రశేఖర్ ఆ పార్టీలో చేరారట. 2018 ఎన్నికల ముందు పార్టీలో చేరిన కొత్తలో హూ ఆర్ యూ అనే వారట. మహబూబ్‌నగర్‌లో పార్టీ కార్యక్రమాలు జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు వచ్చినప్పుడు ఏర్పాట్లు, ఆందోళనలు, ప్రెస్‌మీట్లలో మాట్లాడినప్పుడు ఇలా జరిగేవి. కానీ చివర్లో పోతూపోతూ హూ ఆర్ యూ అనే వారట. పార్టీలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న నన్ను గుర్తించే వారే లేరా? అని అనుమానం వచ్చేదట. ఒకసారి హైదరాబాద్‌లో పార్టీ నాయకుల పిలుపుతో జంట నగరాల్లోని డివిజన్లలో కార్యకర్తలతో సమావేశాలు జరిపి అక్కడ పరిస్థితిని రాష్ట్ర నేతలకు వివరించేవారట.. అంతా విన్నాక హూ ఆర్ యూ అనేవారట. కానీ నిన్న మొన్న వచ్చిన డీకే అరుణ, జితేందర్‌రెడ్డిని కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకులు హౌ ఆర్ యూ అని పలకరించేవారు.. అప్పుడు అనుమానం వచ్చి ఓహో పార్టీలో డబ్బులు ఉన్నవాళ్లకు, అగ్రవర్ణాలకు మాత్రమే స్థానం ఉందా.. తన లాంటి బీసీలు ఎంత పని చేసినా.. పార్టీలో తనకు హూ ఆర్ యూ తప్ప.. హౌ ఆర్ యూ అనే పలకరింపు ఉండదని గుర్తించి పార్టీ మారినట్లు మాజీ మంత్రి స్వయంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీసీలకు తగిన ప్రాధాన్యమిస్తున్నామనడానికి మాలాంటి వారి చేరికే ఉదాహరణ అన్నారు.

- నీంకార్ వెంకటేశ్వర్‌రావు



సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయ భవనం



వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయ భవనం

బిగ్ స్టోరీ

# సంరక్షణకు సలాం

## దేశానికి ఆదర్శంగా తెలంగాణ పోలీస్

- పదేండ్లలోనే నంబర్ వన్ స్థాయికి
- 10.13 లక్షల సీసీ కెమెరాలతో నిఘా
- 9 ఏండ్లలో 45,800 ఉద్యోగాలు భర్తీ
- వాహనాల సంఖ్య 20,115కు పెంపు
- డీపీవోలు, ఠాణాల్లో కొత్త సాంకేతికత
- మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా
- చోరీ సెల్‌ఫోన్లను గుర్తించడంలోనూ నంబర్ వన్

పట్టుమని పదేండ్ల వయసు లేదు.. శాంతిభద్రతల నిర్వహణలో తెలంగాణ పోలీస్ అఖండ భారతావనికే ఆదర్శం. ఆడబిడ్డల రక్షణ కోసం, మానవ అక్రమ రవాణాను అడ్డుకునే కంకణబద్ధులైన పోలీసు బలగం మనది. పది లక్షలకుపైగా సీసీ కెమెరాలతోపాటు, సంఘ విద్రోహశక్తులను పీచమణచే పోలీసు కుటుంబాల సంరక్షణకు ఆర్థిక తోడ్పాటునందిస్తున్న సీఎం కేసీఆర్‌కు, తెలంగాణ గంగా జమునా తెహజీబ్‌గా రాష్ట్ర ప్రజలకు రక్షణగా నిలుస్తున్న పోలీసులకు సలాం...

... రవికుమార్ తోటపల్లి

**ఉ**మ్మడి పాలనలో అస్తవ్యస్తంగా ఉన్న తెలంగాణ పోలీసు వ్యవస్థను పటిష్ట ప్రణాళికతో తీర్చిదిద్దడంతో మన పోలీసులు దేశానికి రోల్ మోడల్‌గా నిలిచారు. ఇదే విషయాన్ని 'ఇండియా జస్టిస్ రిపోర్టు–2022', 'తెలంగాణ సోషియో ఎకనామిక్స్ సర్వే–2023' చెప్పాయి. ఇండియా జస్టిస్ రిపోర్టు–2022 సర్వేలో తెలంగాణ పోలీస్ వ్యవస్థ తొలిసారిగా మొదటి ర్యాంకును సొంతం చేసుకున్నది. 2019లో 11వ స్థానంలో, 2020లో 10వ ర్యాంకులో కొనసాగిన తెలంగాణ 2022 నివేదికలో ఒకేసారి 9 ర్యాంకులకు ఎగబాకి మొదటి స్థానానికి చేరుకున్నది. పోలీసు కేటగిరీలో తక్కువగా ఖాళీలు, ఎక్కువ భర్తీలు, తలసరి వ్యయంలో పెరుగుదల, ఠాణాలు, సిబ్బంది శిక్షణ, ఆధునీకరణకు నిధులు, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు, మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయింపులు, గస్తీ, సీసీ కెమెరాల నిర్వహణ, ఉమెన్ హెల్ప్ డెస్కులు, సమర్థ శిక్షణ, పోస్టుల భర్తీల్లో పారదర్శకత వంటి అంశాలు తెలంగాణ పోలీసు వ్యవస్థకు మొదటి ర్యాంకు రావడానికి దోహదపడ్డాయి. ఇదే రిపోర్టు ప్రకారం.. జైళ్ల నిర్వహణలో 3వ స్థానాన్ని కైవసం చేసుకున్న తెలంగాణ.. సత్వర న్యాయాన్ని, న్యాయపరంగా బాధితులకు సహాయాన్ని అందించడం వంటి రెండు విభాగాల్లోనూ 5వ స్థానంలో నిలిచింది.

### పోలీసు వ్యవస్థ విస్తృతమైన తీరిది...

| | |
|---|---|
| జిల్లాల పునర్విభజన తర్వాత 9 కమిషనరేట్ల ఏర్పాటు | సర్కిళ్ల సంఖ్య 688 నుంచి 719కు పెంపు |
| పోలీస్ సబ్ డివిజన్ల సంఖ్య 139 నుంచి 164కు పెంపు | పోలీస్ స్టేషన్ల సంఖ్య 712 నుంచి 815కు పెంపు |
| రాష్ట్రం ఏర్పడే నాటికి 5 వేల వాహనాలుంటే 2023 నాటికి 20 వేలకు పైగా ఉన్నాయి | |

### ప్రధాన మార్పులు

- కేవలం 10 ఏండ్లలో దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా తెలంగాణ
- మహిళలకు పోలీసు ఉద్యోగాల్లో 33.3 శాతం రిజర్వేషన్లు
- 10 ఏండ్లుగా మత ఘర్షణలు లేని రాష్ట్రంగా రికార్డు
- పోలీస్ శాఖ నియామకాల్లో వయో పరిమితి 3 ఏండ్లు పెంపు
- సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టు అమలులో దేశంలోనే నం.1 స్థానం.. స్కోచ్ సిల్వర్ అవార్డు
- తెలంగాణలో 10 లక్షల మంది నేరస్తుల డేటా బేస్
- దేశంలోనే రెండో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా 'పంజాగుట్ట'కు గుర్తింపు
- వరుసగా 4వ సారి 'బెస్ట్ పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ అవార్డు
- డయల్ 100కు కాల్ వస్తే 7 నిమిషాల్లో ఘటనా స్థలానికి పోలీసులు
- హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఈ సమయం 5 నిమిషాలే
- డయల్ 100 ద్వారా సుమారు 10 లక్షల ఫోన్ కాల్స్ ద్వారా ఫిర్యాదులు అందాయి


### 10 లక్షలకు పైగా సీసీ కెమెరాలు

**ఉ**మ్మడి రాష్ట్రంలో సుమారు లక్ష సీసీ కెమెరాలే ఉన్నాయి. ఈ పదేండ్లలో తెలంగాణ వ్యాప్తంగా 10.13 లక్షల సీసీ కెమెరాలు ఉన్నాయి. 'స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా–2023' ప్రకారం పోలీసు ఆధీనంలో ఉన్న సీసీ కెమెరాల్లో తెలంగాణది మొదటిస్థానం. దేశంలోనే అత్యధికంగా సీసీ కెమెరాలున్న రాష్ట్రంగా అనతికాలంలోనే తెలంగాణ అవతరించింది. కాగా, ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా సీసీ కెమెరాలున్న టాప్–20 నగరాల్లో 16వ స్థానంలో హైదరాబాద్ నిలిచింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో నమోదవుతున్న కేసుల్లో.. 90 శాతం కేసులను సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా మన పోలీసులు ఛేదిస్తున్నారంటే నిఘా వ్యవస్థను ప్రభుత్వం ఎంత పటిష్టంగా మార్చిందో అర్థం చేసుకోవచ్చు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రాలుగా పిలువబడే ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటివి తెలంగాణ తర్వాతనే ఉన్నాయి.

### 137 కొత్త పోలీసు భవనాలు

**రా**ష్ట్రం ఏర్పడిన వెంటనే పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 90 ఠాణాల్లో ఫ్రంట్ ఆఫీసులు నిర్మించారు. మండలానికో పోలీస్ స్టేషన్ ఉండాలన్న ఉద్దేశంతో ఈ కార్పొరేషన్ సుమారు 137 కొత్త పోలీస్ స్టేషన్లకు భవనాల నిర్మాణం చేపట్టింది. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో 17 జిల్లా పోలీస్ అధికారుల కార్యాలయాల (డీపీవో) నిర్మాణాలను రూ.654.50 కోట్లతో చేపట్టారు. ఒక్కో డీపీవోకు సుమారు రూ.38.50 కోట్ల ఖర్చుతో అత్యాధునిక, సాంకేతిక వసతులతో భవనాన్ని నిర్మించారు. దినసరి ఖర్చుల కోసం జంట నగరాలలోని ఒక్కో పోలీస్ స్టేషన్‌కు నెలకు రూ.75 వేలు, జిల్లాకేంద్రాల్లో రూ.50 వేలు, మండలాల్లోని ఠాణాకు రూ.25 వేలను మెయింటెనెన్స్ అలవెన్స్ కింద మంజూరు చేస్తున్నారు.

### 2014 నుంచి 2023 వరకు బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)




### పోలీసు వ్యవస్థకు ఆర్థిక దన్ను...

**కే**సీఆర్ సీఎంగా మొదటి సమావేశం డీజీపీతో నిర్వహించి పోలీస్ శాఖలో మౌలిక సదుపాయాల కల్పనకు, అత్యాధునిక వాహనాల కొనుగోలుకు రూ.375 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇప్పించారు. ఆ తర్వాత ఇదే పద్దు కింద మరొక రూ.500 కోట్లను ఇప్పించారు. 2014–15లో బడ్జెట్‌లో రూ.3,306.92 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ఏటా పోలీసు శాఖకు బడ్జెట్ పెంచుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.9,598.98 కోట్లను కేటాయించింది. గడిచిన పదేండ్లలో పోలీసు శాఖకు రూ.59,200.41 కోట్లను ఖర్చు చేసింది.

### పోలీసుల సంక్షేమానికి పెద్దపీట

**పో**లీసుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. ట్రాఫిక్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్‌ల కింద మూలవేతనంపై 30 శాతం పెంచింది. తెలంగాణ రాకముందు పోలీసులకు ఏడాదికోసారి ఇచ్చే యూనిఫాం అలవెన్స్ ఏ మూలకూ సరిపోయేది కాదు. స్వరాష్ట్రంలో 2018, ఫిబ్రవరి 20న యూనిఫాం అలవెన్స్ రూ.3,500 నుంచి రూ.7,500లకు పెంచారు. విధి నిర్వహణలో మరణిస్తే రూ.1.05 కోట్లు, విధుల్లో లేనప్పుడు మరణిస్తే రూ.90 లక్షలు, శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.60 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి గురైతే రూ.30 లక్షల ప్రమాద బీమాను అందిస్తున్నది. ఈ మేరకు గత జూలైలో బ్యాంక్ ఆఫ్ బరోడాతో ఒప్పందం కుదిరింది. హోంగార్డులను సైతం ప్రభుత్వం కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నది. 2014లో రూ.9 వేలుగా ఉన్న హోంగార్డుల వేతనాన్ని రూ.17 వేలకు పెంచి.. ఇప్పుడు రూ.27 వేల గౌరవ వేతనం ఇస్తున్నది. ట్రాఫిక్ హోంగార్డులకు అలవెన్స్‌లతో కలుపుకొని రూ.30 వేల పైనే జీతం అందుతున్నది. వీటికి తోడు యూనిఫాం అలవెన్స్ రూ.7,500, రూ.5 లక్షల ప్రమాద బీమా, మహిళా కానిస్టేబుళ్లతో సమానంగా మహిళా హోంగార్డులకు సౌకర్యాలు కల్పిస్తూ.. తెలంగాణ అగ్రస్థానంలో ఉంది.

### క్రైమ్ రేట్ తగ్గుముఖం


**తె**లంగాణ ప్రభుత్వ మార్గ నిర్దేశనంలో రాష్ట్ర పోలీసు శాఖ అవలంబిస్తున్న నూతన విధానాలతో రాష్ట్రంలో క్రైమ్ రేట్ తగ్గిపోతున్నది. ఈ ఏడాది మహిళల పట్ల నేరాలు 46 శాతం తగ్గాయి. పోక్సో కేసుల సంఖ్య భారీగా తగ్గింది. ఇక కిరాయి హత్యలు 18 శాతానికి పడిపోయాయి. దారి దోపిడీ ఘటనలు గతేడాది కంటే ఈ ఏడాది 7 శాతానికి తగ్గుముఖం పట్టాయి. రేప్ కేసులు 10 శాతం తగ్గాయి. మొత్తంగా గడిచిన ఆరు నెలల్లో నమోదైన క్రైమ్ రేట్ 4.80 శాతం మాత్రమే.



సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా



ఫిర్యాదుదారులకు రిసెప్షన్ సేవలు



పోలీసుల కోసం కొత్త వాహనాలు



### కొత్త సంస్కరణలు

**తె**లంగాణ పోలీసు శాఖ ఎన్నో సంస్కరణలు చేపట్టింది. మానవ అక్రమ రవాణాను నివారించేందుకు దేశంలోనే తొలిసారిగా 'ఉమెన్ సేఫ్టీ వింగ్'ను ఏర్పాటు చేసింది. అన్ని జిల్లాల్లో షీటీమ్స్‌ను ఏర్పాటు చేసింది. గృహ హింసను అరికట్టేందుకు భరోసా కేంద్రాలు తీసుకొచ్చింది. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్‌ను తీసుకొచ్చింది. పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత, భరోసా కల్పించడానికి 'సాహస్' వ్యవస్థ పనిచేస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన షీ టీమ్స్ విధానాన్ని ఎన్నో రాష్ట్రాలు అధ్యయనం చేసి, అమలు చేస్తున్నాయి. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా 'తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను ఏర్పాటు చేసింది మన రాష్ట్ర సర్కారు. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలను అడ్డుకునేందుకు 'తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో'ను ఏర్పాటు చేసింది. ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేక 'ప్రొటెక్షన్ సెల్'ను ఏర్పాటు చేశారు.

### నిష్పక్షపాతంగా నియామకాలు

**తె**లంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్బీ) ద్వారా పోలీసుల ఉద్యోగాలు అర్హులైనవారికి దక్కుతున్నాయి. నిష్పక్షపాతంగా ఈ నియామక ప్రక్రియను చేపడుతున్నారు. గడిచిన ఆరేండ్లలో టీఎస్ఎల్‌పీఆర్బీ ద్వారా 28,284 ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేయగా.. ప్రస్తుతం 17,516 ఉద్యోగాలు భర్తీ చేసే ప్రక్రియ తుది దశలో ఉంది. ఇప్పటికే ఎస్సై పోస్టు అభ్యర్థులు శిక్షణలో ఉండగా.. కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాలు తుది దశలో ఉన్నాయి. తొమ్మిదేండ్లలో 45,800 మందికి పోలీసు కొలువులు వచ్చాయి. ఉద్యోగాల్లో 95 శాతం స్థానికులకే అవకాశాలు కల్పిస్తున్నారు. అయితే, దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో పోలీసు ఉద్యోగాల్లో మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తున్నారు. శిక్షణలో ఉన్న ఎస్సైలు, ఫలితాలు తుది దశలో ఉన్న కానిస్టేబుళ్లను మినహాయిస్తే.. 2019–20 నాటికి హోంగార్డులను కలుపుకొని పోలీసుల సంఖ్య 86,829.

# ఆ సభ నుంచి ఈ సభ దాకా..

- రెండు సభలకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖులు
- శాసన మండలి, శాసనసభ రెండింటికీ ఎన్నికైన నేతలు
- మూడు సభలకూ ప్రాతినిధ్యం వహించిన కడియం శ్రీహరి

**రా**జకీయాల్లో ఒకసారి గెలవడమే కష్టంగా ఉన్న రోజులివి. ఇక మరోసారి గెలవడమంటేనే కత్తిమీద సాములాంటి పరిస్థితులున్నాయి. కానీ ఇలాంటి తరుణంలోను కొంత మంది అటు అసెంబ్లీకి.. ఇటు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించి అరుదైన రికార్డును నెలకొల్పారు. కొందరు లోక్‌సభకు, శాసనసభకు ఎన్నిక కాగా, మరికొందరు శాసనసభ, శాసనమండలికి రెండింటికి ప్రాతినిధ్యం వహించినవారున్నారు. ఇక మూడు సభలకు ప్రాతినిధ్యం వహించి అరుదైన రికార్డు కడియం శ్రీహరి సొంతం. మరికొంత మంది అసెంబ్లీలో అడుగు పెట్టేందుకు తాజాగా బరిలో నిలిచారు. వారి వివరాలు ఓ సారి చూద్దాం!







- సీఎం కేసీఆర్ అటు అసెంబ్లీకి, ఇటు పార్లమెంట్ రెండింటికీ ప్రాతినిధ్యం వహించారు. సిద్దిపేట, గజ్వేల్‌ల నుంచి ఎమ్మెల్యేగా, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్‌ల నుంచి ఎంపీగా గెలిచారు. పలు పర్యాయాలు రాష్ట్ర కేంద్రమంత్రిగా పనిచేసి, రెండు సార్లు సీఎంగా సేవలందించారు. ఈ సారి గజ్వేల్, కామారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి బరిలో నిలిచారు.
- సీనియర్ నేత కడియం శ్రీహరి మూడు సభలకు ప్రాతినిధ్యం వహించారు. గతంలో ఎమ్మెల్సీగా, ఉప ముఖ్యమంత్రి హోదాలో పనిచేసిన ఆయన ప్రస్తుతం శాసన మండలిలో ఎమ్మెల్సీగా ఉంటూనే స్టేషన్ ఘన్‌పూర్ నుంచి శాసనసభకు తలపడుతున్నారు. కడియం గతంలో ఘన్‌పూర్ నుంచే మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2014–15 కొంత కాలంపాటు వరంగల్ ఎంపీగా సైతం సేవలందించారు.
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదిలాబాద్ ఎంపీగా గెలిచారు. 1991–96, 2008–09ల్లో ఎంపీగా, 2004–08, 2014–23 వరకు నిర్మల్ ఎమ్మెల్యేగా సేవలందించి, మళ్లీ నిర్మల్ నుంచే తలపడుతున్నారు.
- చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ అటు అసెంబ్లీకి, ఇటు పార్లమెంట్ రెండింటికీ ప్రాతినిధ్యం వహించారు. 2014–18 వరకు పెద్దపల్లి ఎంపీగా, 2018లో ఎమ్మెల్యేగా సేవలందించి, మళ్లీ ఇప్పుడు చెన్నూరు నుంచే తలపడుతున్నారు.
- మంత్రి మల్లారెడ్డి పార్లమెంట్‌కు, అసెంబ్లీకి వెళ్లారు. 2014లో మల్కాజిగిరి ఎంపీగా పనిచేసి, 2018లో మేడ్చల్ నుంచి అసెంబ్లీకి గెలిచి, తాజాగా అసెంబ్లీ బరిలో నిలిచారు.
- కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గతంలో శాసన మండలి సభ్యుడిగా పనిచేశారు. ఎమ్మెల్సీగా ఉంటూనే కొడంగల్‌లో గెలిచారు. తాజాగా అదే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.
- డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక పర్యాయం మండలికి ప్రాతినిధ్యం వహించి ప్రస్తుతం రెండోసారి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఈసారి శాసనసభలో అడుగుపెట్టేందుకు జనగామ సెగ్మెంట్ నుంచి బరిలో నిలిచారు.

... కొంటు మల్లేశం